RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:133 | మే 19, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్ 9701923260



## రైతుల కష్టార్జితం అగ్నికి ఆహుతి

- పేరూరులో అగ్నిప్రమాదం..
- వంద ధాన్యం బస్తాలు దగ్ధం
- గుర్తుతెలియని వ్యక్తుల నిర్లక్ష్యంతో వ్యాపించిన మంటలు

2లో

## భారత్ బుల్లెట్ రైలు ఫస్ట్ లుక్ విడుదల

- ముంబయి–అహ్మదాబాద్ హైస్పీడ్ ప్రాజెక్టు పనులు శరవేగం
- దేశ తొలి బుల్లెట్ రైలుకు రూపురేఖలు సిద్ధం
- జపాన్ సాంకేతికతతో ఆధునిక రైలు వ్యవస్థ నిర్మాణం

2లో



## నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటరీ కమిటీ కీలక చర్యలు

- ఎన్‌టీఏ పనితీరు, సంస్కరణలపై సమీక్షకు సిద్ధం
- ప్రశ్నాపత్రం లీక్ దర్యాప్తు వివరాలు కోరిన కమిటీ
- పరీక్షల పారదర్శకత, భద్రతపై ప్రత్యేక దృష్టి
- సీబీఐ దర్యాప్తులో మరో నిందితుడి అరెస్టు

2లో






## 40 ఏళ్ల తర్వాత నార్వే గడ్డపై..

- సుదీర్ఘ కాలం తర్వాత భారత ప్రధాని పర్యటన
- ఒస్లోలో మోడీకి ఘన స్వాగతం పలికిన ప్రధాని స్టోర్
- భారత్–నార్డిక్ సదస్సుపై ఆసక్తి

2లో

## తెలంగాణకు చల్లటి కబురు

- నేడు, రేపు పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు
- ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణ మార్పులు
- ఎల్లుండి నుంచి మళ్లీ పెరగనున్న ఎండల తీవ్రత

2లో




## తెలంగాణ పాలిటిక్స్‌లో డిజిటల్ సైన్యం!

### గెలుపోటములను శాసించే సోషల్ మీడియా

- సామాజిక మాధ్యమాల పవర్ గ్రహించిన ప్రధాన పార్టీలు
- ప్రజాభిప్రాయాన్ని మార్చడంలో కీలక పాత్ర
- ఇప్పటి నుంచే బలోపేతం చేస్తూ వ్యూహాలు
- వ్యూహకర్తలకు భారీ ఆఫర్లు..
- వినూత్న ప్రచారాలు, కౌంటర్ అటాక్‌ల కోసం పక్కా ప్లాన్
- యువతను ఆకట్టుకోవడంలో సోషల్ మీడియానే మంత్రం
- సంప్రదాయ ప్రచారానికి తోడుగా ఇక 'సోషల్' వార్

2లో


**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

రాబోయే ఎన్నికల గెలుపోటములను శాసించే అసలైన పొలిటికల్ యుద్ధం ఇప్పుడు ప్రతి ఓటరు చేతిలోని 'స్మార్ట్‌ఫోన్ స్క్రీన్' పైనే నడుస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో సంప్రదాయ ప్రచార శైలిని దాటి, మునుపెన్నడూ లేని విధంగా అత్యంత పదునైన 'డిజిటల్ వార్' మొదలైంది. ఓటర్లతో నేరుగా కనెక్ట్ అవ్వడానికి, ప్రజాభిప్రాయాన్ని క్షణాల్లో మార్చేయడానికి సోషల్ మీడియా ఇప్పుడు రాజకీయ పార్టీల చేతిలో ఒక శక్తివంతమైన బ్రహ్మాస్త్రంగా మారింది. గత ఓటముల పాఠాల నుంచి, ప్రస్తుత అధికార పట్టుదల దాకా.. ఈ డిజిటల్ నెట్‌వర్క్ చూపించే ప్రభావాన్ని అన్ని పార్టీలు పూర్తిగా గ్రహించాయి. అందుకే అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, జాతీయ వ్యూహాలతో దూసుకుపోతున్న బీజేపీలతో పాటు.. 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో కొత్తగా రంగంలోకి దిగిన కల్వకుంట్ల కవిత పార్టీ సైతం ఇప్పటి నుంచే డిజిటల్ వేదికలపై యుద్ధానికి సై అంటున్నాయి.

## బండి భగీరథ్ పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరం

- స్నేహితుల విచారణపై దృష్టి పెట్టిన పోలీసులు
- సాక్షుల వాంగ్మూలాలతో కీలక ఆధారాల సేకరణ
- భగీరథ్ కస్టడీ కోసం కోర్టును ఆశ్రయించే అవకాశం

**వేద న్యూస్, హైదరాబాద్**



బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. కేసుకు సంబంధించి ఘటన జరిగిన సమయంలో భగీరథ్‌తో కలిసి ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్న అతని స్నేహితులను పోలీసులు విచారణకు పిలిపించారు. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ఆధారంగా పేట్‌బషీరాబాద్ పోలీసులు ఈ విచారణ చేపట్టారు. సోమవారం పలువురు యువకులను పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఘటన జరిగిన రోజు ఏం జరిగిందనే విషయాలపై పోలీసులు ఆరా తీశారు. సంఘటన జరిగిన తర్వాత రాజీ ప్రయత్నాలు జరిగాయా, ఎవరెవరు పాల్గొన్నారు, ఘటనకు ముందు తర్వాత పరిస్థితులు ఎలా

మిగతా 2వ పేజీలో

## టీఆర్ఎస్ జెండా గద్దె నమూనా ఆవిష్కరణ

- రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో నిర్మాణం
- నెల రోజుల పాటు జెండా పండుగ నిర్వహణకు పిలుపు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన కల్వకుంట్ల కవిత



**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రక్షణ సేన పార్టీ బలోపేతం, పార్టీ గుర్తింపును గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లే లక్ష్యంతో జెండా గద్దెల నిర్మాణంపై పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన చేశారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర సాధారణ మండలి

మిగతా 2వ పేజీలో

వేద న్యూస్





## రోడ్డుపై నడిపించుకుంటూ బైండోవర్

- రౌడీ షీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్
- శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించేది లేదు
- మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్**

వరంగల్ మిల్స్ కాలనీ పోలీసులు వినూత్నంగా వ్యవహరించారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, నేర చరిత్ర కలిగిన వారికి.. పోలీస్ మార్క్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే, ఇది సాధారణ కౌన్సెలింగ్ అని వచ్చిన వారు పోలీసులు ఇచ్చిన షాక్‌కు ఖంగుతిన్నారు. కౌన్సెలింగ్ చేసి ఏకంగా రోడ్డుపై వారితో పరేడ్ నిర్వహించారు. స్టేషన్ నుంచి ఖిలా వరంగల్ ఏమార్వో కార్యాలయం వరకు నడిపించుకుంటూ వెళ్లి బైండోవర్ చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విజువల్స్ వైరల్ అవుతున్నాయి. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని.. ఎవరినీ ఉపేక్షించబోమని మిల్స్ కాలనీ సీఐ రమేష్ హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, వాటిని అరికట్టేందుకు పటిష్ఠమైన చర్యలు అమలు చేస్తామని అయన అన్నారు.

## భారత్ బుల్లెట్ రైలు ఫస్ట్ లుక్ విడుదల

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

భారతదేశపు తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను కేంద్ర రైల్వే శాఖ విడుదల చేసింది. ముంబయి–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో రైల్వే మంత్రిత్వ శాఖ కార్యాలయం వద్ద బుల్లెట్ రైలు నమూనా చిత్రాన్ని ప్రదర్శించారు. అత్యాధునిక సాంకేతికతతో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్టుపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మొత్తం ఐదు వందల ఎనిమిది కిలోమీటర్ల పొడవుతో నిర్మితమవుతున్న ముంబయి–అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు జపాన్ సాంకేతికత, ఆర్థిక సహకారంతో రూపొందుతోంది. ఈ కారిడార్ గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలతో పాటు దాద్రా నగర్ హవేలీ కేంద్రపాలిత ప్రాంతం గుండా ప్రయాణించనుంది. దేశ రవాణా రంగంలో ఇది చారిత్రాత్మక మార్పులకు నాంది పలుకుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ముంబయి, థానే, విరార్, బోయిసర్, వాపి, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి ప్రాంతాల్లో మొత్తం పన్నెండు స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన స్టేషన్లు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేగం, భద్రత, సౌకర్యం పరంగా ఈ ప్రాజెక్టు అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండనుంది. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఎనిమిది స్టేషన్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని రైల్వే శాఖ వెల్లడించింది. ప్రధాన నదులపై నిర్మిస్తున్న వంతెనల పనులు కూడా తుది దశకు చేరుకున్నాయి. మహారాష్ట్రలో సముద్రపు అడుగున నిర్మిస్తున్న సొరంగం పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయి. సుమారు ఇరవై ఒకటి కిలోమీటర్ల పొడవు గల ఈ సొరంగం ప్రాజెక్టులో కీలక భాగంగా నిలుస్తోంది. దేశంలో తొలి బుల్లెట్ రైలును ఈ ఏడాది సూరత్–బిలిమోరా మధ్య ప్రారంభించే అవకాశాలు ఉన్నట్లు రైల్వే శాఖ సంకేతాలు ఇచ్చింది.

## బండి భగీరథ్ పోక్సో కేసు దర్యాప్తు ముమ్మరం

**మొదటి పేజీ తరువాయి**

ఉన్నాయనే అంశాలపై ప్రశ్నించినట్లు సమాచారం. అనంతరం వారి వాంగ్మూలాలను నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ కేసులో దర్యాప్తు భాగంగా పోలీసులు ఆధారాల సేకరణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే భగీరథ్‌ను అరెస్టు చేసిన అనంతరం దాదాపు రెండు గంటల పాటు విచారించి అతడి వాంగ్మూలాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదైన తర్వాత ఎందుకు కనిపించలేదనే అంశంపై కూడా పోలీసులు ప్రశ్నించినట్లు సమాచారం. విచారణ సందర్భంగా తన వద్ద ఉన్న కొన్ని ఆధారాలను భగీరథ్ సమర్పించినట్లు సమాచారం. తాను ఎలాంటి తప్పు చేయలేదని కూడా పోలీసులకు వివరించినట్లు తెలుస్తోంది. మరోవైపు బాధితురాలి తల్లి ఫిర్యాదు, ఆమె ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పోలీసులు వివిధ ప్రశ్నలు సంధించి వివరాలు సేకరించారు. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం, భగీరథ్ ఇచ్చిన వివరణలను పోలీసులు పరస్పరం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనంతరం భగీరథ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయమూర్తి ముందు హాజరుపరిచిన పోలీసులు అతడిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఇక పూర్తిస్థాయి విచారణ కోసం భగీరథ్‌ను కస్టడీకి తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో సాక్షుల వాంగ్మూలాలు కీలకంగా మారనున్నాయి. అప్పటికే బాధితురాలు, ఆమె తల్లి, భగీరథ్ వాంగ్మూలాలు నమోదు కాగా, సాక్షులు ఇచ్చే వివరాల ఆధారంగా కేసు దిశ మారే అవకాశాలు ఉన్నాయని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు మొయినాబాద్ ప్రాంతంలోని రెండు ఫామ్‌హౌస్‌లు, నానక్‌రాంగూడలోని సర్వీస్ అపార్టుమెంట్‌ల నుంచి పోలీసులు పలు ఆధారాలు సేకరించినట్లు సమాచారం.

## తెలంగాణకు చల్లటి కబురు

**వేద న్యూస్, హైదరాబాద్**

భానుడి భగభగలతో ఉక్కిరిబిక్కిరవుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఊరటనిచ్చే సమాచారం వెల్లడించింది. రాష్ట్రంలో ఉపరితల చక్రవాత ఆవర్తన ప్రభావంతో నేడు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షాలు కొంత ఉపశమనం కలిగించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం హైదరాబాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, కామారెడ్డి, మల్కాజిగిరి, రంగారెడ్డి, వనపర్తి, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

# తెలంగాణ పాలిటిక్స్‌లో డిజిటల్ సైన్యం!

- గెలుపోటములను శాసించే సోషల్ మీడియా
- సామాజిక మాధ్యమాల పవర్ గ్రహించిన ప్రధాన పార్టీలు
- ప్రజాభిప్రాయాన్ని మార్చడంలో కీలక పాత్ర
- ఇప్పటి నుంచే బలోపేతం చేస్తూ వ్యూహాలు
- వ్యూహకర్తలకు భారీ ఆఫర్లు..
- వినూత్న ప్రచారాలు, కౌంటర్ అటాక్‌ల కోసం పక్కా ప్లాన్
- యువతను ఆకట్టుకోవడంలో సోషల్ మీడియానే మంత్రం
- సంప్రదాయ ప్రచారానికి తోడుగా సోషల్ వార్

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు డిజిటల్ వార్ మొదలైంది. క్షేత్రస్థాయిలో సంప్రదాయ ప్రచారాలైన సభలు, రోడ్ షోలు ఒకవైపు జరుగుతున్నప్పటికీ, రాబోయే ఎన్నికల గెలుపోటములను శాసించే అసలైన యుద్ధం మాత్రం ఈసారి 'డిజిటల్ స్క్రీన్ల' పైనే జరగబోతోంది. ఓటర్లతో నేరుగా సంప్రదింపులు జరపడానికి, ప్రచారాలను క్షణాల్లో వేగవంతం చేయడానికి, ప్రజాభిప్రాయాన్ని అనుకూలంగా మార్చుకోవడానికి సోషల్ మీడియా ఇప్పుడు అత్యంత శక్తివంతమైన బ్రహ్మాస్త్రంగా మారింది. ఈ డిజిటల్ పవర్ ఏంటో ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు పూర్తిగా గ్రహించాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాము ఓడిపోవడానికి సోషల్ మీడియాలో జరిగిన తప్పుడు ప్రచారాలే ప్రధాన కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగంగానే ప్రకటించారంటే.. ఈ నెట్‌వర్క్ ఎంతటి తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుందో అర్థం చేసుకోవచ్చు.




### సోషల్ మీడియాపై పార్టీల దృష్టి

వచ్చే ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లతో పాటు.. ఇటీవల 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో సరికొత్తగా రంగంలోకి దిగిన కల్వకుంట్ల కవిత సైతం ఇప్పటి నుంచే తమ సోషల్ మీడియా వింగ్స్‌ను సమూలంగా బలోపేతం చేసుకుంటున్నాయి. ఇందుకోసం జాతీయ, రాష్ట్ర స్థాయిలో పేరున్న సోషల్ మీడియా స్ట్రాటజిస్టులను సైతం రంగంలోకి దించుతూ వినూత్న ప్రచారానికి తెరలేపుతున్నాయి.

### యువతే కీలకం

నేటి సమాజంలో 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసున్న యువ ఓటర్లే ఎన్నికల్లో కీలకం. వీరంతా ఉదయం లేచినప్పటి నుండి రాత్రి పడుకునే వరకు ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ రీల్స్‌లోనే గడుపుతున్నారు. ఈ సగటు యువ ఓటర్ల మనస్తత్వాన్ని అంచనా వేసి, వారి శైలిలోనే ఆకట్టుకునేలా పొలిటికల్ మీమ్స్, షార్ట్ వీడియోల ద్వారా పార్టీలు మమేకం అవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాగుతున్న ఆధునిక రాజకీయాల తరహాలోనే, ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లోనూ సోషల్ మీడియా ద్వారా చిన్న చిన్న మొత్తాల్లో ఎన్నికల నిధులను సేకరించే ట్రెండ్ ఊపందుకుంది. ఇది పార్టీలకు ఆర్థిక బలంతో పాటు ప్రజల్లో ఓనర్‌షిప్ భావాన్ని పెంచుతుంది.

### పలు స్ట్రాటజీలతో జనాల్లోకి..

రాజకీయాల్లో టైమింగ్ చాలా ముఖ్యం. ప్రత్యర్థులు వేసే విమర్శనాత్మక అస్త్రానికి గంటల వ్యవధిలోనే పక్కా ఆధారాలు, పాత వీడియో క్లిప్పింగ్‌లతో కౌంటర్లు ఇవ్వడం, స్పష్టతనివ్వడం ఇప్పుడు అనివార్యమైంది. ఎవరు ఎంత వేగంగా సోషల్ మీడియాలో రెస్పాండ్ కాగలిగితే.. న్యూట్రల్ ఓటర్లలో అంత పాజిటివ్ మైలేజ్ వస్తుంది. క్షేత్రస్థాయిలో సర్వే ఏజెన్సీలతో పాటు, సోషల్ మీడియా వేదికలపై నిర్వహించే డిజిటల్ పోల్స్ ద్వారా ప్రజామోదాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. పౌరుల అసంతృప్తి ఏ అంశాలపై ఉందో తెలుసుకుని వ్యూహాలను మార్చుకుంటున్నారు.

### నాలుగు పార్టీల భిన్న వ్యూహాలు

రాబోయే ఎన్నికలు తెలంగాణలోని నాలుగు ప్రధాన శక్తులకు జీవన్మరణ సమస్యగా మారాయి. అందుకే సంప్రదాయ ప్రచార శైలిని కొనసాగిస్తూనే, తెరవెనుక సోషల్ మీడియా వార్ రూములను అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు, 'ఆరు గ్యారంటీలు' క్షేత్రస్థాయికి ఎలా చేరుతున్నాయో లబ్ధిదారుల వీడియోల ద్వారా కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి మార్క్ దూకుడు ప్రసంగాలను రీల్స్ రూపంలో వైరల్ చేస్తూ, ప్రభుత్వ వ్యతిరేక ప్రచారాలను తిప్పికొట్టేందుకు పెద్ద ఎత్తున డిజిటల్ సైన్యాన్ని రంగంలోకి దించింది. జాతీయ స్థాయిలో సోషల్ మీడియాను వాడుకోవడంలో బీజేపీది ప్రత్యేక శైలి. ఢిల్లీ పెద్దల పక్కా వ్యూహాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, జాతీయవాదం వంటి అంశాలను ఇక్కడి లోకల్ సెంటిమెంట్‌కు ముడిపెడుతూ సరికొత్త పొలిటికల్ గెరిల్లా వార్ నడుపుతోంది. మైక్రో–లెవెల్ వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రతి ఓటరును టార్గెట్ చేస్తోంది. గత ఎన్నికల ఓటమి నేర్పిన పాఠాలతో ఈసారి బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ అత్యంత పదునైన వ్యూహాలతో పనిచేస్తోంది. కేటీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, నిరుద్యోగ సమస్యలు, నెరవేరని హామీలను ఎప్పటికప్పుడు గ్రాఫిక్స్, మీమ్స్ రూపంలో జనంలోకి తీసుకెళ్తూ డిజిటల్ స్పేస్‌లో దూసుకుపోతోంది. కొత్తగా ఏర్పడిన పార్టీ కాబట్టి, ప్రజల్లోకి 'పాంచజన్యం' హామీలను, సరికొత్త అజెండాను వేగంగా తీసుకెళ్లడానికి కల్వకుంట్ల కవిత సోషల్ మీడియానే ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నారు.

### సోషల్ మీడియా ప్రచారానికి కోట్ల ఖర్చు..

ఈ డిజిటల్ యుగంలో కేవలం జెండాలు, ఫ్లెక్సీలు, మైక్ సెట్లతోనే ఎన్నికల ప్రచారం ముగిసిపోవడం లేదు. ఓటర్ల మైండ్‌సెట్‌ను మార్చడంలో సోషల్ మీడియానే అత్యంత కీలకమైన అస్త్రం కావడంతో.. ప్రధాన పార్టీలన్నీ డిజిటల్ ప్రచారం కోసం కోట్ల రూపాయల బడ్జెట్‌ను కుమ్మరిస్తున్నాయి. కేవలం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ వేదికలపై అధికారిక యాడ్స్ ఇవ్వడానికే కాకుండా.. తెరవెనుక వందలాది మందితో నడిచే హైటెక్ వార్ రూముల నిర్వహణకు, పేరుమోసిన పొలిటికల్ స్ట్రాటజిస్టులకు కోట్లాది రూపాయల ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నిరంతరం రీల్స్, షార్ట్స్, మీమ్స్ క్రియేట్ చేసే ప్రొఫెషనల్ వీడియో ఎడిటర్లు, గ్రాఫిక్ డిజైనర్లు, కంటెంట్ రైటర్లను పెద్ద మొత్తంలో జీతాలు ఇచ్చి మరీ నియమించుకుంటున్నాయి. ప్రతి ఓటరు చేతిలోని స్మార్ట్‌ఫోనే లక్ష్యంగా సాగుతున్న ఈ డిజిటల్ గెరిల్లా వార్‌లో గెలవడం కోసం, ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే నెలకు కోట్ల రూపాయల నిధులను నీళ్లలా ఖర్చు చేస్తూ ప్రధాన పార్టీలు తమ సోషల్ మీడియా సైన్యాన్ని సిద్ధం చేస్తున్నాయి.

## నీట్ పేపర్ లీక్‌పై పార్లమెంటరీ కమిటీ కీలక చర్యలు

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ యూజీ–2026 ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) పనితీరుతో పాటు సంస్థలో అమలవుతున్న సంస్కరణలను సమీక్షించాలని నిర్ణయించింది. ప్రశ్నాపత్రం లీక్ కేసు దర్యాప్తు పురోగతి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించనుంది. ఈ మేరకు ఎన్‌టీఏ ఛైర్‌పర్సన్ ప్రదీప్ కుమార్ జోషి సహా పలువురు ఉన్నతాధికారులకు కమిటీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21న కమిటీ ఎదుట హాజరై కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించింది. ప్రశ్నాపత్రం లీక్ ఎలా జరిగింది, దర్యాప్తు ఏ దశలో ఉంది, అమలవుతున్న సంస్కరణల పరిస్థితి ఏమిటి అనే అంశాలపై సమగ్ర నివేదిక కోరింది. విద్య, మహిళలు, పిల్లలు, యువత, క్రీడలకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యసభ విడుదల చేసిన ప్రకటన ప్రకారం విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమై వివిధ అంశాలపై అభిప్రాయాలు సేకరించనున్నారు. విద్యా వ్యవస్థలో పెరుగుతున్న సవాళ్లను ఎదుర్కొనే చర్యలపై చర్చ జరగనుంది. సమావేశ అజెండాలో ఎన్‌టీఏ సంస్కరణలపై కె. రాధాకృష్ణన్ కమిటీ నివేదిక అమలుపై సమీక్ష కూడా ఉంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, సాంకేతిక భద్రత, విశ్వసనీయత పెంపుపై కమిటీ ప్రత్యేక దృష్టి సారించనుంది. విద్యార్థుల్లో నమ్మకం పెంచేందుకు అవసరమైన మార్పులపై కూడా చర్చించనున్నారు. అదే సమయంలో విద్యారంగంలో కృత్రిమ మేధస్సు ప్రభావం, విద్యార్థుల ఉపాధి అవకాశాల పెంపుపై కూడా కమిటీ చర్చించనుంది. ఈ సమావేశానికి ప్రముఖ విద్యా, సాంకేతిక సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్ కేసు దర్యాప్తులో సీబీఐ మరో కీలక నిందితుడిని అరెస్టు చేసింది. మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి చెందిన విద్యా సంస్థ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రశ్నాపత్రం లీకేజీ ముఠాతో అతనికి సంబంధాలున్నట్లు విచారణలో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అతని వద్ద లీకైన ప్రశ్నాపత్రానికి సంబంధించిన ఆనవాళ్లు లభించినట్లు సమాచారం. అనంతరం కోర్టులో హాజరుపరచగా తొమ్మిది రోజుల కస్టడీ విధించారు. దేశంలో అత్యంత కీలకమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్‌పై ఇలాంటి వివాదాలు తలెత్తడం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన పెంచుతోంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, విశ్వసనీయత పెంపుపై ప్రభుత్వం తీసుకునే చర్యలపై ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

## 40 ఏళ్ల తర్వాత నార్వే గడ్డపై..

**వేద న్యూస్, నేషనల్ డెస్క్**

ప్రధాని నరేంద్ర మోదీ నార్వే పర్యటనలో భాగంగా సోమవారం ఓస్లో చేరుకున్నారు. విమానాశ్రయంలో నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్ ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. నార్వేలో భారత ప్రధానమంత్రి పర్యటించడం నలభై సంవత్సరాల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషంగా మారింది. నార్వే పర్యటనపై ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. ఈ పర్యటన భారత్–నార్వే సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రెండు దేశాల మధ్య స్నేహబంధాలు మరింత బలపడేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా నార్వే రాజు హరాల్డ్ ఐదవ, రాణి సోన్జాను ప్రధాని మోదీ కలవనున్నారు. అలాగే నార్వే ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. పరస్పర సహకారం, వాణిజ్యం, అభివృద్ధి వంటి అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. రేపు జరగనున్న మూడో భారత్–నార్డిక్ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఈ సమావేశంలో నార్డిక్ దేశాల నాయకులతో భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. పలు కీలక అంశాలపై చర్చలు జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. భారత్, నార్డిక్ దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఈ సదస్సు వేదికగా నిలవనుంది. ఆర్థిక, సాంకేతిక, పర్యావరణ రంగాల్లో పరస్పర భాగస్వామ్యాన్ని మరింత పెంచే దిశగా చర్చలు జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. నార్వే పర్యటనతో అంతర్జాతీయ వేదికపై భారత్ సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పర్యటనపై ప్రపంచ దేశాల దృష్టి నెలకొంది.

## టీఆర్ఎస్ జెండా గద్దె నమూనా ఆవిష్కరణ

**మొదటి పేజీ తరువాయి**

సమావేశంలో పార్టీ జెండా గద్దె నమూనాను ఆవిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాలో జెండా గద్దెలను నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ పార్టీ భావజాలం, సిద్ధాంతాలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలంటే పార్టీకి ప్రత్యేక గుర్తింపు అవసరమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో ఒకే తరహా నమూనాలో జెండా గద్దెలు ఏర్పాటు చేస్తే పార్టీకి ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యక్రమాలు ఎక్కడ జరిగినా ఒకే రూపకల్పన కనిపించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా గద్దె నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక నమూనాను పార్టీ సిద్ధం చేసిందని తెలిపారు. మూడు అడుగుల ఎత్తు, రెండు అడుగుల వెడల్పుతో జెండా గద్దెలను నిర్మించాలని సూచించారు. బేస్ భాగం ఒక అడుగు ఎత్తుతో ఉండగా, పై భాగం రెండు అడుగుల ఎత్తుతో నిర్మించాలని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో ఒకే కొలతలు పాటించాలని పార్టీ శ్రేణులకు ఆదేశించారు. జెండా గద్దె రూపకల్పనలో రంగులకు కూడా ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చినట్లు వివరించారు. బేస్ భాగానికి ఆకుపచ్చ రంగు ఉపయోగించాలని, పై భాగానికి పసుపు రంగు వినియోగించాలని సూచించారు. మధ్యలో నీలం రంగులో తెలంగాణ రాష్ట్ర పటాన్ని ఏర్పాటు చేయాలని, దాని మధ్యలో ఆంగ్ల అక్షరాల్లో టీఆర్ఎస్ అని రాయాలని పేర్కొన్నారు. అలాగే బేస్ భాగంలో తెలుగులో తెలంగాణ రక్షణ సేన అని స్పష్టంగా కనిపించేలా రాయాలని సూచించారు.

## రైతుల కష్టార్జితం అగ్నికి ఆహుతి

**వేద న్యూస్, మెదక్**

మెదక్ మండలం పేరూరు గ్రామ శివారులో జరిగిన అగ్నిప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. ఈ ప్రమాదంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన ధాన్యం బస్తాలు మంటల్లో కాలిపోయాయి. అకాలంగా జరిగిన ఈ ఘటనతో బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల సమాచారం ప్రకారం పేరూరు గ్రామ శివారులో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు పెట్టినట్లు తెలుస్తోంది. అయితే అక్కడి నుంచి మంటలు గాలి వేగం కారణంగా సమీపంలోని ప్రైవేట్ వెంచర్ ప్రాంతంలోకి వ్యాపించాయి. ఒక్కసారిగా మంటలు విస్తరించడంతో అక్కడ నిల్వ చేసిన ధాన్యం బస్తాలకు నిప్పు అంటుకుంది. తూకం వేసి విక్రయానికి సిద్ధంగా ఉంచిన రైతులు సిద్ధిరాములు, పోచయ్యకు చెందిన సుమారు వంద ధాన్యం బస్తాలు ఈ ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. కళ్లముందే పంట అగ్నికి ఆహుతి కావడంతో రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఎంతో శ్రమించి పండించిన పంట ఇలా కాలిపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# రైతుల కష్టాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**– బీఆర్ఎస్ నాయకులారా ఇకనైనా అసత్యపు ప్రచారాలు మానుకోండి**

**గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి, పొడకంటి సరస్వతి శేఖర్**

**వేద న్యూస్, తొర్రూర్ :**



రైతుల కష్టాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని చీకటాయపాలెం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి,పొడకంటి సరస్వతి శేఖర్ లు అన్నారు. చీకటాయిపాలెం గ్రామంలో గత రెండు రోజులుగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఐకెపి సెంటర్ నిర్వహణపై చేస్తున్న అసత్యపు ఆరోపణలపై గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ స్పందిస్తూ... సోమవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేయడం జరిగింది. అనంతరం వారు సంయుక్తంగామాట్లాడుతూ..గ్రామంలోని కొనుగోలు సెంటర్లో గన్ని బస్తాల కొరత లేదని టిఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలనే రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తొర్రూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి లా ఆదేశానుసారం తొర్రూర్ మండలంలో మన గ్రామానికి అధికంగా లారీలు రావడం మూలంగా పదివేల బస్తాలు కాంటాలు నిర్వహించి మిల్లులకు తరలించడం జరిగింది. మిల్లులోకి తరలించిన అన్ని బస్తాలలో ఏ ఒక్క రైతుకు కూడా కట్టింగ్ లేకుండా అన్లోడ్ జరిగిందని అన్నారు.రెండు రోజుల క్రితమే మరల పదివేల గన్ని బస్తాలు అందుబాటులోకి తేవడం జరిగింది. వీటిని కూడా సీరియల్ ప్రకారమే కాంటాలు నిర్వహించి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సెంటర్ ఇన్చార్జికి సూచించినట్లు తెలిపారు. అంతేకాకుండా సీరియల్ ప్రకారమే కొంతమంది రైతులకు సర్పంచ్ తానే దగ్గరుండి ఏ గొడవలు లేకుండా గన్ని సంచులు ఇప్పియడం జరిగింది. కావాలనే టీఆర్ఎస్ పార్టీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని,ప్రతి విషయాన్ని పార్టీ పరంగా చూడకుండా గ్రామ అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలని అన్నారు. అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు బూరుగుల దస్తగిరి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో సెంటర్లలోకి ఒక్క లారీ కూడా రాలేని సందర్భంలో రైతుల సొంతంగా ట్రాక్టర్లు మాట్లాడుకుని మిల్లులోకి వెళ్తే, మిల్లర్లు ఒక ట్రాక్టర్ కి పది నుంచి 20 బస్తాలు కటింగ్ అవుతున్నాయని రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న ఆరోజు కనీసం రైతుల పక్షంలో ఒక్క టిఆర్ఎస్ నాయకులు కూడా మాట్లాడలేదు కానీ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రతి సెంటర్ కి ప్రభుత్వమే లారీలను పంపిస్తున్న, లారీలు రావట్లేదని అబద్ధపు మాటలు మాట్లాడడం, గన్ని బస్తాలు ఉన్న లేవని చెప్పడం రైతులు ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా ఈ చిల్లర రాజకీయాలు మానుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిన్నాల వేణు, వార్డు సభ్యులు వేల్పుగొండ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె దయాకర్, వేల్పుగొండ చిన్న వెంకన్న,తండు యాకయ్య,సింగం దామోదర్, వేల్పుగొండ ఉప్పలయ్య, కొండ లింగయ్య, రైతులు కొండ కొమురయ్య,కొండ శ్రీశైలం, బూర్గుల దేవదానం, జీడిగంటి సోమయ్య, వేల్పుగొండ వెంకట్నర్సు తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**– రసాయనాల వాడకం తగ్గించాలని సూచన**

**– అన్నదాతలకు అవగాహన సదస్సు**



**వేద న్యూస్, నల్లబెల్లి :**

మండలంలోని మేడిపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సుకు వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ డి. వీరన్న, మండల వ్యవసాయ అధికారి బి. రజిత ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరన్న మాట్లాడుతూ.. సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించి నేల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అవసరానికి తగ్గట్టే రసాయన ఎరువులు, పురుగుమందులు వాడాలని, పంటల మార్పిడి విధానం, నీటి ఆదా పద్ధతులను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి రజిత మాట్లాడుతూ.. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని అధిక ఆదాయం పొందాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయం, సమగ్ర చీడపీడల యాజమాన్య పద్ధతులను అనుసరించాలని కోరారు. అనంతరం రైతులు అడిగిన సాంకేతిక సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎ. సమ్మయ్య, వ్యవసాయ విస్తరణ అధికారి బి. మహేందర్, వ్యవసాయ కళాశాల విద్యార్థినులు హర్షిత, రూపతో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కళాశాల విలీనం అన్యాయం




**వేద న్యూస్, రుద్రూర్ :**

**– అఖిలపక్షం, విద్యార్థి సంఘాల ఆందోళన**

**– వ్యవసాయ కళాశాల వద్ద ధర్నా**

రుద్రూర్ మండల కేంద్రంలోని అక్బర్‌నగర్ ప్రాంతీయ చెరుకు పరిశోధన స్థానం పరిధిలో ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అఖిలపక్షం, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అక్బర్‌నగర్‌లోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను జగిత్యాల జిల్లాలోని పోలాస కళాశాలలో విలీనం చేయాలని ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు నిర్ణయించడం విద్యార్థులకు అన్యాయమని విమర్శించారు. 2026-27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఇక్కడ జరగవని ప్రొసీడింగ్స్ జారీ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అక్బర్‌నగర్ కళాశాలలో హాస్టల్, తరగతి గదులు, ప్రాక్టికల్ శిక్షణ కోసం వ్యవసాయ భూములు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు అందుబాటులో ఉన్నప్పటికీ కళాశాలను తరలించడానికి ప్రయత్నించడం వెనుక అధికారుల నిర్లక్ష్యం ఉందని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న ఏకైక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను మూసివేయడం సరికాదని, ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను వెంటనే వెనక్కి తీసుకుని ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ కుమార్, అక్బర్‌నగర్ సర్పంచ్ సీతారాం రాజు, ఉపసర్పంచ్ హబీబ్ ఖాన్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం

**– ప్రతిరోజూ 45 నిమిషాలు కేటాయించాలి – ఎంపీడీవో రామకృష్ణ**



**వేద న్యూస్, నడికూడ :**

యోగ ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలు యోగకు కేటాయించాలని నడికూడ మండల ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో యువజన, క్రీడ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు కిలోమీటర్ల వాక్‌థాన్ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాణితో కలిసి ఎంపీడీవో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులతో కలిసి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీఓ రవిబాబు, ఎస్సై పవన్, ఎంపీఓ మార్గవి రెడ్డి, డీటీ సత్యనారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రవీందర్, వివిధ గ్రామాల సర్పంచులు భోగి శ్రీలత, ఓదెల శ్రీలత, జగత్ ప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే అభివృద్ధి సాధ్యం

**– పేద పిల్లల విద్యకు సహాయం చేయండి**

**– డాక్టర్ అనితా రెడ్డి**

**వేద న్యూస్, హనుమకొండ :**



అనురాగ్ సొసైటీ మరియు వరల్డ్ వైజ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని డాన్ బాస్కో వీధి బాలల ఆశ్రమంలో అనాథ, సెమీ ఆర్ఫన్ మరియు వీధి బాలలకు నోట్‌బుక్స్, పండ్లు, చాక్లెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదరికం విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో పేద పిల్లలకు సహాయం చేస్తున్నామని తెలిపారు. గత 30 ఏళ్లుగా అనేక మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ఫీజుల సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యా దానం మహాదానం అని, ప్రతి ఒక్కరూ తమ వంతుగా పేద పిల్లలకు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. విద్యతోనే వ్యక్తి ఆర్థికంగా, సామాజికంగా ఎదుగుతాడని, పిల్లలు క్రమశిక్షణతో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. వేసవి సెలవుల్లో కూడా డ్రాప్‌అవుట్ పిల్లలకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోధన అందిస్తున్న డాన్ బాస్కో సిబ్బందిని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్, శారద, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.1 కోటి అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**– అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం**

**– పనులను నాణ్యతతో పూర్తి చేయాలి**

**– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**




**వేద న్యూస్, హనుమకొండ :**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్ హనుమాన్ నగర్‌లో రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లు, డ్రైనేజీ వంటి సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. హనుమాన్ నగర్ ప్రాంతంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ పనులు ఉపయోగపడతాయని తెలిపారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# తులాస్యా తండాకు విద్యుత్ వెలుగులు

**– లో వాల్టేజ్ సమస్యకు చెక్**

**– అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన విద్యుత్ శాఖ**

**వేద న్యూస్, కారేపల్లి :**



ఎన్నో నెలలుగా ప్రజలను వేధిస్తున్న లో వాల్టేజ్ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించడంతో కారేపల్లి మండలంలోని తులాస్యాతండా గ్రామంలో ఆనందం నెలకొంది. గ్రామంలో అదనంగా 25 కె.వి.ఏ సామర్థ్యంగల సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గృహోపకరణాలు పనిచేయకపోవడం, విద్యార్థులు చదువులకు ఇబ్బంది పడటం వంటి సమస్యలు ఉండేవి. గ్రామ ప్రజల సమస్యలను గుర్తించిన వైరా విద్యుత్ శాఖ డీఈ యల్లంపల్లి రమేష్, ఏడీఈ ఎండీ యాసిన్ మార్గదర్శకత్వంలో ఏఈ వెంకన్న సిబ్బందితో కలిసి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా మెరుగుపడింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, ఏడీఈ ఎండీ యాసిన్, ఏఈ వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు నాగులు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మే 19, 2026

# చిన్నారి కిడ్నాప్ యత్నం కలకలం

**– అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తిని పట్టుకున్న స్థానికులు**



**వేద న్యూస్, గద్వాల్ ప్రతినిధి:**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చిన్నారి కిడ్నాప్ యత్నం కలకలం రేపింది. గద్వాల్ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ సమీపంలో ఇద్దరు మహిళలు, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండగా స్థానికులు అప్రమత్తమయ్యారు. వారి వద్ద ఓ చిన్న పిల్లవాడిని సంచీలో వెంట తీసుకెళ్తుండటాన్ని గమనించిన ప్రజలు వారిని అడ్డుకుని ప్రశ్నించారు. సమాధానాలు సరిగా లేకపోవడంతో స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనతో కాలనీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# ఘనంగా స్టార్ హెల్త్ 20వ వార్షికోత్సవ వేడుకలు

- వరంగల్ నుండి హనుమకొండ వరకు భారీ బైక్ ర్యాలీ
- ఆరోగ్య రక్షణలో స్టార్ హెల్త్ మరో అడుగు ముందుకు
- కోట్లాది కుటుంబాలకు ఆరోగ్య భద్రతే లక్ష్యం
- స్టార్ హెల్త్ ఏ.ఆర్.హెచ్ సురేష్ గాండ్ల



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ తన 20వ వార్షికోత్సవ వేడుకలను నగరంలోని పోచమ్మ మైదాన్ లోని వరంగల్ జోన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కార్యాలయం నుండి హనుమకొండ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్టార్ హెల్త్ జెండాలతో, నినాదాలతో సాగిన ఈ ర్యాలీ నగర ప్రజలను ఆకట్టుకుంది. వేడుకల్లో స్టార్ హెల్త్ అసిస్టెంట్ రీజనల్ హెడ్ గాండ్ల సురేష్, జోనల్ మేనేజర్ రాజారెడ్డి, డివిజన్ మేనేజర్ సాధుల వర్ధన్ పాల్గొని సంస్థ సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కోట్లాది కుటుంబాలకు ఆరోగ్య భీమా రక్షణ కల్పిస్తూ స్టార్ హెల్త్ సంస్థ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. పాలసీదారుల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలను అందించేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. ఆరోగ్య భీమా రంగంలో స్టార్ హెల్త్ సంస్థ ప్రత్యేక గుర్తింపు సాధించిందని, సాధారణ కుటుంబాలకు సైతం మెరుగైన వైద్య భద్రత అందించే దిశగా అనేక వినూత్న పాలసీలను ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న ఏజెంట్లు, సేల్స్ మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది, పాలసీదారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వార్షికోత్సవ వేడుకలలో భాగంగా సిబ్బంది, ఏజెంట్ల కోసం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఏజెంట్లు, కార్యాలయ సిబ్బంది, సేల్స్ మేనేజర్లు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# అనారోగ్య బాధితుడికి ఎన్నారై అపన్నహస్తం

**– అమెరికా నుంచి ఆర్థిక సాయం**



**వేద న్యూస్, రామడుగు :**

కరీంనగర్ జిల్లా రామడుగు మండల కేంద్రానికి చెందిన మామిడి అంజయ్య అనారోగ్యంతో మంచాన పడగా, గ్రామానికి చెందిన ఎన్నారై తోట సత్యం మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించారు. గత కొద్ది నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ చికిత్స పొందుతున్న అంజయ్య కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ విషయం తెలుసుకున్న అమెరికాలో నివసిస్తున్న తోట సత్యం వైద్య ఖర్చుల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం పంపించారు. అంతేకాకుండా కుటుంబ ఖర్చుల కోసం ప్రతి నెల రూ.2 వేల చొప్పున సహాయం అందిస్తానని తెలిపారు. ఈ మొత్తాన్ని స్థానికులు సముద్రాల శ్రీనివాస్, రామడుగు అశోక్, జెట్టిపల్లి అశోక్, వార్డు సభ్యుడు చంద అనిల్, శిరిగిరి వెంకటేశం, కర్నె శ్రీను చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి సహాయం చేసిన ఎన్నారై తోట సత్యంను గ్రామస్తులు అభినందించారు.

# రసాయన ఎరువులు వాడొద్దు

- సేంద్రియ వ్యవసాయంతోనే అధిక దిగుబడులు
- రైతులకు అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, శాయంపేట :**

శాయంపేట మండలం మైలారం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ ధృవీకరణ, శాస్త్రీయ సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తలుగా పాల్గొన్న ప్రొఫెసర్ డాక్టర్ బి. విద్యాధర్, డాక్టర్ సిద్ధార్థ నాయక్ సేంద్రియ వ్యవసాయం వల్ల నేల భౌతిక, రసాయన, జీవ లక్షణాలు మెరుగుపడతాయని వివరించారు. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందుల అధిక వినియోగం నేల సూక్ష్మజీవుల సమతుల్యతను దెబ్బతీస్తుందని తెలిపారు. జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్, గ్రీన్ మ్యాన్యూరింగ్, బయో ఫెర్టిలైజర్లు, బయో పెస్టిసైడ్ల వినియోగం ద్వారా నేల సారవంతత పెరుగుతుందని వివరించారు. సేంద్రియ ధృవీకరణ ద్వారా రైతులు తమ ఉత్పత్తులను జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉంటుందని తెలిపారు. పీజీఎస్, ఎన్‌పీఓపీ విధానాల ద్వారా సులభంగా ధృవీకరణ పొందవచ్చని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ప్రియదర్శిని మాట్లాడుతూ.. వరి, మొక్కజొన్న పంటల అవశేషాలను తగులబెట్టకుండా నేలలో కలపాలని సూచించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని పోషకాలు, సేంద్రియ కార్బన్ తగ్గిపోతాయని తెలిపారు. పంట అవశేషాలను త్వరగా కుళ్లించేందుకు పూసా డీకంపోజర్, ట్రైకోడెర్మా వంటి జీవ డీకంపోజర్ల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి అన్వేష్, గ్రామ సర్పంచ్ దివ్య, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, వ్యవసాయ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలి



**వేద న్యూస్, నిజామాబాద్ ప్రతినిధి :**

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ ను బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సోమవారం కలిశారు. జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలోగల ఎంపీ కార్యాలయంలో ఆయనను కలిసి, తమ సమస్యలు, డిమాండ్లపై మెమోరాండం అందజేశారు. కేంద్ర ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ ఫోరమ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనల్లో భాగంగా ఎంపికి మెమొరాండం ఇవ్వడం జరిగింది. అనంతరం సమావేశంలో ఉద్యోగ భద్రత, పెన్షన్ హక్కులు, బ్యాంకుల ప్రైవేటీకరణ, సిబ్బంది కొరత, పెరుగుతున్న పనిభారం వంటి అంశాలపై ఎంపీతో సుదీర్ఘంగా చర్చించారు. నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) ఉద్యోగుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెడుతోందని పేర్కొంటూ పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని కోరారు. అలాగే ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాలను ఉపసంహరించుకుని ప్రజా రంగ బ్యాంకులను బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు, ఆరోగ్య భద్రతా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నిజామాబాద్ నగరంలోని ప్రగతి భవన్ ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, గురునాథ్, శ్రీనివాస్, సునంద, ప్రమోద్, సుధాకర్, సుప్రీం, సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# టీకేఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పైడిపాల రవి


**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పైడిపాల రవి సోమవారం నియమించారు. ఈ బాధ్యతలను టీకేఎస్ వ్యవస్థాపకులు, గౌరవ అధ్యక్షులు ఆకారపు మోహన్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా నుండి పైడిపాల రవిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం జరిగిందని రాష్ట్ర కన్వీనర్ ఏనుగుతల యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పై నమ్మకంతో నియమించి నందుకు ఆకారపు మోహన్, రాష్ట్ర కోకన్వీనర్ అమరవాది సారంగపాణి,రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ కొన్నే సిద్దయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.




# పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లు!

- పనిచేయని ఆటోమేటిక్ టైమర్లు
- కన్నెత్తి చూడని విద్యుత్ అధికారులు
- ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- ప్రభుత్వ ధనం వృథాపై ప్రజల ఆగ్రహం



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి:**

వేములపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతుండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన వీధిలైట్లు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కూడా వెలుగుతుండటంతో ప్రభుత్వ విద్యుత్ వినియోగం అనవసరంగా పెరిగి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధాన రహదారులు, గ్రామపంచాయతీ పరిధులు, కాలనీలు, చౌరస్తాలలో వీధిలైట్లు నిరంతరం వెలుగుతుండగా సంబంధిత విద్యుత్ అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆటోమేటిక్ టైమర్లు సరిగా పనిచేయకపోవడం, పర్యవేక్షణ లోపించడమే ఇందుకు ప్రధాన కారణమని ఆరోపిస్తున్నారు. పగటి సమయంలో కూడా లైట్లు ఆపకుండా కొనసాగుతుండటంతో విద్యుత్ వృథా అవుతోందని, పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పగటి సమయంలో వెలుగుతున్న వీధిలైట్లను వెంటనే నిలిపివేసి, ఆటోమేటిక్ వ్యవస్థలను సరిచేసి ప్రభుత్వ ధనం వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**– 35 మందికి ఆర్థిక సాయం అందజేత**



**వేద న్యూస్, చొప్పదండి :**

కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 35 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. చొప్పదండి శాసనసభ్యులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, పీసీసీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నూతన మండల, పట్టణ అధ్యక్షుల ఎన్నికల కోసం అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నిజానపురం చందు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్, కౌన్సిలర్లు కొట్టే అశోక్, ముద్దం తిరుపతి, గుర్రం రాజేందర్ రెడ్డి, పిట్టల వెంకటేష్, సర్పంచులు చొక్కళ్ల తిరుపతి, మాచర్ల జగన్, బద్దెనపల్లి సతీష్, పెద్దెల్లి సురేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల రాజేందర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అమరచింతలో యాక్టివ్ తెలంగాణ యోగ కార్యక్రమం



**వేద న్యూస్, వనపర్తి :**

వనపర్తి జిల్లా అమరచింత మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా యాక్టివ్ తెలంగాణ యోగ కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు చేపట్టారు. 6:30 నిమిషాలకు ప్రారంభం కావలసిన ఈ కార్యక్రమం అధికారుల ఆలస్యం వల్ల 8:00 గంటలకు ప్రారంభమైంది. ఇట్టి కార్యక్రమానికి గ్రౌండ్ లో ఉన్న క్రీడాకారులు అధికారులు ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

వేద న్యూస్

మంగళవారం మే 19, 2026

# తాగునీటి కోసం తండ్లాట!

- ఎండాకాలంలో నీటి కోసం అవస్థలు
- బోర్లు ఎండిపోవడంతో గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు
- బిందె నీళ్ల కోసం గంటల -తరబడి క్యూలో
- తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

ఎండాకాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వేములపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సరిపడా తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు నీటి కోసం ఉదయం నుంచే ఆపరేటర్ ఎప్పుడు నీరు వదులుతారో అంటూ ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన బోర్లు ఎండిపోవడం, నీటి ట్యాంకులు సక్రమంగా నింపకపోవడం వల్ల ప్రజలకు తాగునీరు అందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నిచోట్ల వారానికి ఒక్కసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతుండటంతో మహిళలు గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సి వస్తోందని చెబుతున్నారు. తాగునీటి కోసం చిన్నపిల్లలతో కలిసి మహిళలు తీవ్ర ఎండలో తిరుగుతుండటంతో వారి ఆరోగ్యంపై కూడా ప్రభావం పడుతోందని గ్రామస్తులు అంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాలకు తగినంత తాగునీరు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజల ఇబ్బందులను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# చీడిగ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లించాలి

- రూ.5.20 లక్షలు ఇవ్వాలని సీఐటీయూ డిమాండ్

**వేద న్యూస్, చీడిగ :**

కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామం వద్ద జరిగిన టిప్పర్ లారీ ప్రమాదంలో మరణించిన ఉపాధి హామీ కూలీల కుటుంబాలకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా ఒక్కొక్కరికి రూ.5 లక్షల 20 వేల ప్రమాద పరిహారం చెల్లించాలని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కల రాజ్‌కుమార్, ఐరెడ్డి రామ వెంకటేష్ మాట్లాడుతూ.. శనివారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఆరుగురు ఉపాధి హామీ కూలీల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో ఉపాధి హామీ కార్మికులను కూడా సభ్యులుగా చేర్చారని, గతంలో వారికి పలు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. 2026 మార్చి 1 నుంచి సంక్షేమ పథకాలు తిరిగి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేవలం సంతాపం ప్రకటించడం సరిపోదని, కార్మికుల సంక్షేమ నిధులను ఉపయోగించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు.

# భూపాలపట్నంలో ఎస్ఆర్ఎం మేళా

- పిల్లల విద్యా సిద్ధతపై అవగాహన కార్యక్రమం



**వేద న్యూస్, చొప్పదండి :**

కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామంలో ప్రతం ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఎం (స్కూల్ రెడీనెస్ మేళా) కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మాడిపల్లి సంజీవ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ మేళాలో చిన్నారుల విద్యా సిద్ధత, ప్రాథమిక అభ్యాస నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల హెడ్‌మాస్టర్ కృష్ణమూర్తి, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రామస్తులతో ఎస్ఐ ముఖాముఖి సమావేశం

- మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన
- సైబర్ భద్రత, ట్రాఫిక్ నియమాలపై సూచనలు
- యువత అప్రమత్తంగా ఉండాలని పిలుపు



**వేద న్యూస్, తాడేపల్లి :**

ఘంటసాల ఎస్ఐ వి. చందన తాడే పల్లి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించి పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు, యువతతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆమె సమాజ భద్రతకు సంబంధించిన అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. మత్తు పదార్థాల బారిన పడితే వ్యక్తిగత జీవితం, కుటుంబాలు, సమాజం తీవ్ర ప్రభావానికి గురవుతాయని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తెలిపారు. అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ ఇవ్వకూడదని సూచించారు. మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణలో సమాజం పాత్ర కూడా కీలకమని పేర్కొన్నారు. అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, మహిళల భద్రత అందరి బాధ్యత అని వివరించారు. ట్రాఫిక్ నియమాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తెలిపారు. గ్రామాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో చైతన్యం పెంచేందుకు ఉపయోగపడతాయని ఎస్ఐ పేర్కొన్నారు. యువత సమాజానికి ఆదర్శంగా నిలిచి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

# ఉత్పత్తి లక్ష్యాల సాధనపైనే దృష్టి పెట్టాలి



**వేద న్యూస్, మందమర్రి :**

- మందమర్రి ఏరియాలో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాలు
- సింగరేణి భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ

సింగరేణి సీఎండి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు సంస్థ వ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశాల్లో భాగంగా సోమవారం మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ (ఆర్‌కేపీ సీహెచ్‌పీ), ఏరియా వర్క్‌షాప్, ఏరియా స్టోర్స్‌లలో మొదటి షిఫ్ట్ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సమావేశాలకు వివిధ విభాగాల అధికారులు హాజరై ఉద్యోగులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కంపెనీ నిర్దేశించుకున్న ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాల సాధనపై విస్తృతంగా చర్చించారు. భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనుల్లో అత్యాధునిక యంత్రాల వినియోగం, ఉత్పాదకత పెంపుదల, ఉద్యోగుల సంక్షేమ పథకాలు, ఆర్థిక అంశాలపై అధికారులు వివరించారు. కంపెనీ భవిష్యత్ కార్యాచరణ, ఎదురయ్యే సవాళ్లు, వాటిని అధిగమించే విధానాలపై ఉద్యోగులతో చర్చించారు. యాజమాన్యం సూచనలు పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం జీఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు ఇప్పకాయల లింగయ్య, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి, ఆర్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్, సీహెచ్. అశోక్, కె. కిరణ్ కుమార్, రవి, ప్రదీప్, చంద్రమౌళి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘన సన్మానం

- మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ జెడ్పీటీసీ కటారి చంద్రశేఖర రావు



**వేద న్యూస్, గొల్లపల్లి :**

నూతనంగా ఎన్నికైన గొల్లపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపల్లి గంగన్నను సోమవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ కటారి చంద్రశేఖర రావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ఆశీస్సులతో నూతన అధ్యక్షుడిగా నియామకమైన గంగన్నను ఈ సందర్భంగా ఆయన శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నూతన కమిటీ పట్టుదలతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, న్యాయవాదులు, మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# వెల్లటూర్ అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ. 2 లక్షల విరాళం




**వేద న్యూస్, వెల్లటూర్ :**

- వెల్లటూర్ వాస్తవ్యుడు కొత్త శ్రీనివాస్ ధాత ఉదారత

వెల్లటూర్ మండల కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి భారీ విరాళం అందింది. కరీంనగర్‌లో నివసిస్తున్న వెల్లటూర్ వాస్తవ్యులు, కొత్త గురవయ్య - అనంత లక్ష్మి దంపతుల కుమారుడు కొత్త శ్రీనివాస్ ఆలయ నిర్మాణానికి పెద్ద మనసుతో భారీ విరాళాన్ని ప్రకటించారు. ఆదివారం నాడు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు కరీంనగర్‌లో కొత్త శ్రీనివాస్ ని కలిసి, ఆలయ నిర్మాణ విశేషాలను, జరుగుతున్న పనుల వివరాలను ఆయనకు వివరించారు. కమిటీ సభ్యులు అడిగిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా, ఉన్నపళంగా రోడ్డు పైనే రూ. 2,00,000 (రెండు లక్షల రూపాయలు) నగదును ఆయన కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. దాత చూపిన ఈ అపూర్వ ఉదారతకు, తక్షణ స్పందనకు కమిటీ సభ్యులు ఒక్కసారిగా ఆనందానికి, తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఆలయ నిర్మాణానికి ఇంతటి పెద్ద మొత్తాన్ని అందించిన దాత కొత్త శ్రీనివాస్ కుటుంబానికి అయ్యప్ప సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. స్వామివారి కృపాకటాక్షాలు వారి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు.

# జిల్లావ్యాప్తంగా 'ఫేస్ వాష్ అండ్ గో' కార్యక్రమం

- డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా
- అనుమానాస్పద వాహనాలపై తనిఖీలు
- ప్రజల భద్రతే లక్ష్యమని పోలీసుల స్పష్టం




**వేద న్యూస్, నెల్లూరు :**

ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా వ్యాప్తంగా సోమవారం 'ఫేస్ వాష్ అండ్ గో' ప్రత్యేక కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ప్రజల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై కూడా పోలీసులు నిఘా కొనసాగించారు. ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ ప్రజల భద్రతకు భంగం కలిగించే కార్యకలాపాలను గుర్తించే ప్రయత్నం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. రోడ్డు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అధికారులు పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో సురక్షిత వాతావరణాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# భజ్యతండా-బొక్కలతండాలో మంచినీటి బోర్ల ఫ్లషింగ్ పూర్తి

**వేద న్యూస్, కారేపల్లి**

ఎండాకాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు అందించాలనే లక్ష్యంతో భజ్యతండా గ్రామపంచాయతీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. గ్రామపంచాయతీ పరిధిలోని భజ్యతండా, బొక్కలతండా గ్రామాల్లో ఉన్న మంచినీటి బోర్లకు ఫ్లషింగ్ పనులు నిర్వహించారు. గత కొంతకాలంగా బోర్లలో మురికి, ఇసుక తదితర అవశేషాలు పేరుకుపోవడంతో నీటి సరఫరా తగ్గిపోవడం, నీటి నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమస్యను గుర్తించిన గ్రామపంచాయతీ అధికారులు మెకానిక్ మోహన్ ఆధ్వర్యంలో ఫ్లషింగ్ పనులు చేపట్టారు. పనులు పూర్తయ్యాక బోర్ల నుంచి పరిశుభ్రమైన నీరు సరఫరా కావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ముందస్తు చర్యలతో తాగునీటి సమస్యను పరిష్కరించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి దారావత్ జ్యోతి, మెకానిక్ మోహన్, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం గ్రామపంచాయతీ ప్రధాన బాధ్యత. గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తాం అని తెలిపారు.

# జర్నలిస్టుల సేవా కార్యక్రమాలు అభినందనీయం

- ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఐ
- ఐదేళ్లుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న అసోసియేషన్

**వేద న్యూస్, సూర్యాపేట:**

నిత్యం ప్రజా సమస్యలపై వార్తలు సేకరిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న జర్నలిస్టులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సూర్యాపేట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటయ్య అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీప ఫ్లైఓవర్ వద్ద తెలంగాణ స్టేట్ జర్నలిస్టు అసోసియేషన్ (టీఎస్‌జేఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటయ్య మాట్లాడుతూ.. జర్నలిస్టులు తమ వృత్తిలో బిజీగా ఉన్నప్పటికీ ప్రజలకు ఊరట కలిగించేలా ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన టీఎస్‌జేఏ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి, కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి యాదగిరి మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల



సంక్షేమం కోసం పలు ఉద్యమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే సూర్యాపేటలో సుమారు 300 మందికి పైగా ప్రజలకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్, కోశాధికారి కొరివి సతీష్ యాదవ్, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దుస్సా చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు గుంటి శ్రీనివాస్, వంశీకృష్ణ శర్మ, తిరుపతి శ్రీనివాస్, చెరుకు శ్రీనివాస్, యాతకుల మధుసూదన్, కుంచెం రాంబాబు, కొండ రవి, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్లలో రాజకీయ సెగ!

- బీఆర్ఎస్ భవన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు
- బండి సంజయ్, భగీరథ్ ఫోటోలతో భారీ ఫ్లెక్సీ ఏర్పాటు
- నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మరోసారి రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. స్థానిక బీఆర్ఎస్ భవన్ వద్ద భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, ఆయన కుమారుడు భగీరథ్‌ల ఫోటోలతో కూడిన భారీ ఫ్లెక్సీని రోడ్డుపై ఉంచి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఫ్లెక్సీని తొలగించే ప్రయత్నం చేశారు. అయితే బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీసులను అడ్డుకోవడంతో వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి అదుపుతప్పకుండా పోలీసులు నిరసనకారులను చెదరగొట్టారు. ఆందోళనలో పాల్గొన్న పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ స్థానికంగా ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# ప్రాణ భద్రతకు హెల్మెట్ తప్పనిసరి

**వేద న్యూస్, కృష్ణా జిల్లా :**

కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ఉంగుటూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐ యు. గోవిందు పొనుకుమాడు గ్రామంలో ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ అవగాహన సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భద్రతా చర్యల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ కేవలం చట్టపరమైన నిబంధన మాత్రమే కాదని, ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో చాలామంది తలకు గాయాల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. సరైన రక్షణ చర్యలు తీసుకుంటే ప్రమాదాల తీవ్రతను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, అధిక వేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. భద్రతా నిబంధనలు పాటించడం ప్రతి



ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా రోడ్డు భద్రతపై మరింత అవగాహన అవసరమని పేర్కొన్నారు. యువత ముఖ్యంగా ట్రాఫిక్ నిబంధనలపై శ్రద్ధ వహించి ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామ ప్రజలు, ద్విచక్ర వాహనదారులు పాల్గొన్నారు. ప్రజల ప్రాణ భద్రత కోసం పోలీసులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

# గ్రీవెన్స్ డేను ప్రజలు వినియోగించుకోవాలి

- ప్రతి ఫిర్యాదుపై తక్షణ విచారించాలి - జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లా ప్రజలందరూ పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ కోరారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం అందించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వ్యక్తిగత సమస్యలు, భూ వివాదాలు, కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, ఆర్థిక లావాదేవీలు, పోలీస్ సంబంధిత ఇతర అంశాలపై ఫిర్యాదులు చేసినట్లు తెలిపారు. మొత్తం జిల్లా నలుమూలల నుంచి దాదాపు 38 ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత పోలీస్ అధికారులతో వెంటనే విచారణ చేపట్టి, చట్టపరంగా త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ప్రజలు పోలీస్ శాఖపై నమ్మకంతో ముందుకు వచ్చి తమ సమస్యలను తెలియజేయాలని, అందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.

# కాజ్‌వే నిర్మాణానికి భూమిపూజ

- రూ.కోటి నిధులతో వాగుపై బ్రిడ్జి నిర్మాణం

**వేద న్యూస్, దేవరకద్ర:**

మదనపురం మండలం దంతనూరు–శంకరంపేట గ్రామాల మధ్య వాగుపై రూ. కోటి నిధులతో నిర్మించనున్న కాజ్‌వే (బ్రిడ్జి) నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కాజ్‌వే నిర్మాణంతో రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారంలో జాప్యం వొద్దు

- ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించాలని ఆదేశం
- ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దని సూచన

**వేద న్యూస్, గుంటూరు :**



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని అధికారులు అత్యంత శ్రద్ధతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆశతో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తారని, వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రజా ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని శాఖల అధికారులు స్పందించాలని సూచించారు. వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలకు పంపించి సమయపాలనతో పరిష్కారం చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే ప్రజల్లో అసంతృప్తి పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలంటే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు వెంటనే సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచనలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత, వేగం ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు యంత్రాంగం కృషి చేయాలని తెలిపారు.

# టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఎన్నిక



గన్ను సంతోష్ కుమార్.
జాయింట్ సెక్రెటరీ



రంగు శ్రీధర్.
కార్యవర్గ సభ్యులు

**వేద న్యూస్, శాయంపేట :**

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా నూతన కమిటీని ఎన్నికల అధికారి కంకణాల సంతోష్ ఆదివారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఊటుకూరి సీతారామారావు (సాయిరాం) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శాయంపేట మండల కేంద్రానికి చెందిన సీనియర్ రిపోర్టర్ గన్ను సంతోష్ కుమార్ జిల్లా జాయింట్ సెక్రటరీగా, మైలారం గ్రామానికి చెందిన రంగు శ్రీధర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన అనంతరం గన్ను సంతోష్ కుమార్, రంగు శ్రీధర్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పాత్రికేయుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా జర్నలిస్టులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# మిల్లుల్లో అదనపు వాహనాలు సమకూర్చాలి

- హమాలీల సంఖ్య పెంచి అన్‌లోడింగ్ వేగవంతం చేయాలి
- రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో కలెక్టర్ సమీక్ష



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జిల్లాలో ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ రైస్ మిల్లర్లు, లారీల ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలాల వారీగా రైస్ మిల్లులు, గోదాముల్లో ధాన్యం అన్‌లోడింగ్ పరిస్థితి, కొనుగోలు కేంద్రాలకు వాహనాల తరలింపుపై అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అనుగుణంగా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు మరిన్ని వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లర్లు తమ మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచి అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వాహనాలు నిలిచిపోకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, డీసీఓ రామకృష్ణ, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, ట్రాన్స్‌పోర్ట్ అధికారులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం మే 19, 2026

# అనుమతి లేకుండా ధర్నాలు చేస్తే కఠిన చర్యలు

– సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరిక



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల :**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిబంధనల ప్రకారం పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా జిల్లాలో ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు లేదా ర్యాలీలు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి సిరిసిల్ల పట్టణ కేంద్రంలో అనుమతి లేకుండా ధర్నాలు నిర్వహించి, శాంతిభద్రతలకు మరియు ప్రజా రవాణాకు విఘాతం కలిగించిన ఇరు వర్గాలపై సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. క్రైమ్ నంబర్లు 270/2026, 271/2026 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, అసత్య సమా చారాన్ని వ్యాప్తి చేస్తూ జిల్లాలో అశాంతి సృష్టించే ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. వివాదాస్పద పోస్టులు చేసే వ్యక్తులతో పాటు ఆయా వాట్సాప్, సోషల్ మీడియా గ్రూప్ అడ్మిన్‌లను కూడా బాధ్యులుగా పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని, ప్రజలు మరియు అన్ని వర్గాల నాయకులు పోలీసులకు సహకరించాలని డీఎస్పీ నాగేంద్రచారి విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యలు పట్టించుకోని బీజేపీ

– చొప్పదండి మున్సిపాలిటీలో కమలం పార్టీ పాత్రపై చర్చ

**వేద న్యూస్, చొప్పదండి :**




కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపాలిటీలో బీజేపీ పాత్రపై స్థానికంగా రాజకీయ చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 3వ, 8వ, 13వ వార్డుల నుంచి బీజేపీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా గెలుపొందారు. పట్టణ ప్రజలు నమ్మకంతో బీజేపీకి మద్దతు ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం పార్టీ ప్రజా సమస్యలపై ఆశించిన స్థాయిలో స్పందించడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీజేపీకి చెందిన కౌన్సిలర్లు పట్టణ అభివృద్ధి అంశాలపై దృష్టి పెట్టడం కంటే అధికార పార్టీ కార్యక్రమాలకు హాజరవుతూ, వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నారా..? లేక అధికార పార్టీకే మద్దతుగా వ్యవహరిస్తున్నారా..? అనే చర్చ ప్రజల్లో కొనసాగుతోంది. ముఖ్యంగా సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనుల నాణ్యతపై బీజేపీ నాయకత్వం ప్రశ్నలు లేవనెత్తకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొన్ని పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నప్పటికీ, వాటిపై బీజేపీ నుంచి గట్టిగా స్పందన కనిపించడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

# నిర్దేశిత గడువులో ప్రాజెక్టులు పూర్తి చేయాలి



– సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సీఎం సమగ్ర సమీక్ష

**వేద న్యూస్, అమరావతి :**

రాష్ట్ర అభివృద్ధిలో సాగునీటి ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటూ పోలవరం సహా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఇరిగేషన్ క్యాలెండర్‌కు అనుగుణంగా అన్ని ప్రాజెక్టులు నిర్ణయించిన గడువులో పూర్తి కావాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎలాంటి ఆలస్యం చోటుచేసుకోకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ప్రాజెక్టుల ప్రస్తుత పురోగతి, నిర్మాణ దశలు, నిధుల వినియోగం, భూసేకరణ, నీటి నిల్వ సామర్థ్యం, సాగు విస్తీర్ణం పెంపు వంటి పలు అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. ప్రాజెక్టుల పూర్తి వల్ల రాష్ట్ర వ్యవసాయరంగానికి కలిగే ప్రయోజనాలు, రైతుల అవసరాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలపై కూడా అధికారులు వివరాలు సమర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో సాగునీటి ప్రాజెక్టులు అత్యంత కీలకమని అన్నారు. రైతులకు సమయానికి సాగునీరు అందించాలంటే ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం కాకూడదని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల అమలులో చిన్నచిన్న సమస్యలు కూడా పెద్ద ఆటంకాలుగా మారకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పోలవరం వంటి జాతీయ ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్ నీటి అవసరాలకు కీలకమని పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీర్చవచ్చని వివరించారు. నీటి నిల్వ, పంపిణీ, వినియోగంలో సమగ్ర విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. వాటర్ మేనేజ్‌మెంట్‌లో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సాగునీటి సంఘాలు, రైతు సంఘాలు, స్థానిక ప్రజలను భాగస్వాములను చేస్తూ నీటి వినియోగంలో సమర్థత తీసుకురావాలని సూచించారు. నీటి వనరుల పరిరక్షణ లో ప్రజల బాధ్యత కూడా కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూగర్భ జలాల వినియోగంపై కూడా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్న నేపథ్యంలో స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ, నీటి వృథా నివారణ వంటి అంశాలపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు నీటి కొరత సమస్యలు తలెత్తకుండా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించు కోవాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర నీటి నిర్వహణ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నీటి వినియోగంలో ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి పెంచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ సమీక్ష సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, జలవనరుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొ న్నారు. రాష్ట్రంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై అధికారులు సమగ్ర నివేదికలను సమర్పించగా, వాటి అమలుపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రాష్ట్ర నీటి వనరుల వినియోగంలో దీర్ఘకాలిక మార్పులు తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# బాపూ మ్యూజియంలో ఘనంగా మ్యూజియం దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, విజయవాడ :**



అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విజయవాడ బాపూ మ్యూజియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డా. నూకసాని బాలాజీ, రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హెరిటేజ్ వాక్, హెరిటేజ్ క్విజ్, హెరిటేజ్ ఆన్ కాన్వాస్, ఫోటోగ్రఫీ పోటీలు, గైడెడ్ మ్యూజియం టూర్లు, లేజర్ షోలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, యువత, చరిత్రాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలకు ఉత్సాహంగా స్పందించారు. మ్యూజియంలు కేవలం పురాతన వస్తువులను భద్రపరిచే ప్రదేశాలు మాత్రమే కాదని, అవి మన నాగరికత, సంస్కృతి, చరిత్రను భావితరాలకు అందించే జ్ఞాన నిలయాలని ప్రముఖులు పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి ప్రయాణాన్ని అర్థం చేసుకునేందుకు మ్యూజియంలు ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. చారిత్రక వారసత్వ పరిరక్షణపై యువతలో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు. చరిత్రను తెలుసుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలపై గౌరవ భావం పెరుగుతుందని పేర్కొన్నారు. బాపూ మ్యూజియం ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు యువతలో చరిత్ర, సంస్కృతి, వారసత్వంపై కొత్త చైతన్యాన్ని నింపాయి. పాల్గొన్న విద్యార్థులు వివిధ పోటీల ద్వారా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కళాకారులు, విద్యార్థులు, పర్యాటక శాఖ ప్రతినిధులు, సందర్శకులు పాల్గొన్నారు. చారిత్రక సంపదను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# మొక్కజొన్న కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

- లారీలు సమయానికి రావడం లేదని ఆగ్రహం
- మాందారిపేట స్టేజీ వద్ద రోడ్డుపై నిరసన

**వేద న్యూస్, శాయంపేట :**



శాయంపేట గ్రామానికి చెందిన మొక్కజొన్న రైతులు కొనుగోలు కోసం లారీలు సమయానికి రావడం లేదని ఆరోపిస్తూ మాందారిపేట స్టేజీ వద్ద ధర్నాకు దిగారు. పెద్ద సంఖ్యలో చేరుకున్న రైతులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తూ, ఇప్పటికే కోత కోసిన మొక్కజొన్నను పొలాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద నిల్వ ఉంచడంతో నష్టాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు ఆలస్యంగా రావడం వల్ల ధాన్యం తడిసి నాణ్యత తగ్గిపోతుందని, దీంతో ఆర్థికంగా తీవ్ర నష్టం ఎదురవుతోందని రైతులు తెలిపారు. కాంట్రాక్టు ప్రకారం వెంటనే లారీలు పంపించి మొక్కజొన్నను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు, నిర్వాహకులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరారు. ధర్నా కారణంగా కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# రోడ్డెక్కిన అన్నదాతలు

- ధాన్యం తరలింపుపై ఆగ్రహం
- సరిపడా లారీలు లేకపోవడంతో అసహనం
- మెదక్‌బోడుమెట్పల్లి రహదారిపై ధర్నా
- తహసీల్దార్ హామీతో విరమించిన నిరసన



**వేద న్యూస్, పాపన్నపేట :**

ధాన్యం తరలించేందుకు సరిపడా లారీలు ఏర్పాటు చేయడం లేదని ఆరోపిస్తూ మండల పరిధిలోని మిన్పూర్ గ్రామ రైతులు సోమవారం రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు. దీంతో మెదక్-బోడుమెట్పల్లి ప్రధాన రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ధాన్యం తరలింపులో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని రైతులు మండిపడ్డారు. వాతావరణ మార్పులతో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యం తడిసిపోతుందనే భయాందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయినా వాటిని తరలించేందుకు అవసరమైన లారీలు అందుబాటులో లేకపోవడంతో రైతులు రాత్రింబవళ్లు అక్కడే కాపలా కాస్తున్నామని తెలిపారు. తూకం పూర్తయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో కొత్తగా వచ్చిన ధాన్యానికి స్థలం లేక కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీలు, వాహనాల కొరతతో లోడింగ్ పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, మిల్లుల వద్ద కూడా ధాన్యం బస్తాలు దింపకపోవడంతో లారీలు రెండు, మూడు రోజుల పాటు నిలిచిపోతున్నాయని రైతులు పేర్కొన్నారు. దీనివల్ల మరింతగా లారీల కొరత ఏర్పడిందని ఆరోపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ రైతులతో మాట్లాడినా వారు రోడ్డుపైనే బైఠాయించి నిరసన కొనసాగించారు. అనంతరం స్థానిక తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎస్సై, వెంటనే లారీలు సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసనను విరమించారు.

# అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి

**వేద న్యూస్, కాకినాడ :**



ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్‌లో అందిన ప్రతి అర్జీని అధికారులు బాధ్యతాయుతంగా పరిశీలించి సత్వర పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రజలు ఆశతో సమర్పించే వినతులను నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులో పరిష్కరిం చాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో కేవలం సంఖ్యలకే ప్రాధాన్యం ఇవ్వకుండా నాణ్యతతో కూడిన పరిష్కారాలు అందించాలని తెలిపారు. ప్రజలు మళ్లీ అదే సమస్యతో కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పీజీఆర్ఎస్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి శాఖ అధికారి తన పరిధిలోని సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుందని, అందుకే ఫిర్యాదుల పరిష్కారంలో జవాబుదారీతనం అవసరమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరిపాలనలో ముఖ్య లక్ష్యమని పేర్కొంటూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు యంత్రాంగం మరింత చురుకుగా పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

వేద న్యూస్

మంగళవారం మే 19, 2026

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల కళ్లలో ఆనందం

- గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే
- లబ్ధిదారులకు నూతన వస్త్రాల బహూకరణ



**వేద న్యూస్, దేవరకద్ర:**

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొత్త ఇళ్లలోకి ప్రవేశించిన కుటుంబాలకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ, నిర్మాణ పురోగతిని బట్టి రూ.5 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో పేదలు తమ వంతు సహకారం జోడించి ఇళ్లు నిర్మించుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని, వారి కళ్లలో కనిపిస్తున్న ఆనందమే ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికులకు రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలి

## - 25న 'చలో హైదరాబాద్'కు టీయూసీఐ పిలుపు

**వేద న్యూస్, దేవరకద్ర:**




వనపర్తి జిల్లా మదనాపురం మండలం కొత్తపల్లి గ్రామంలో సోమవారం తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం (టీయూసీఐ) ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేసి గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి. రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో లబ్ధి అందడం లేదన్నారు. పలువురు కార్మికులకు బీఓసీ కార్డులు లేకపోవడం, కార్డులు ఉన్నవారు రెన్యువల్ చేసుకోలేకపోవడం, క్లెయిమ్‌లు సకాలంలో అందకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. 60 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు కనీసం రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్, సహజ మరణం వంటి సంక్షేమ పథకాల పరిహారాలను పెంచాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈ నెల 25న నిర్వహించే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు తిమ్మరాజు, కార్తీక్, సుధాకర్, మాసన్న, శేఖర్, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 'పెద్ది' సెన్సార్ పూర్తి.. రామ్ చరణ్ కెరీర్‌లోనే భారీ రన్‌టైమ్!

**వేద న్యూస్ డెస్క్:**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా పెద్ది విడుదలకు సిద్ధమవుతోంది. వృద్ధి సినిమాస్ పతాకంపై నిర్మాత వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్నట్లు సినీ వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. చిత్రానికి సెన్సార్ బోర్డు నుంచి అధికారిక క్లియరెన్స్ లభించిందని, దీంతో విడుదలకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయని టాక్ నడుస్తోంది. ఇప్పుడు ఈ సినిమాకు సంబంధించిన రన్‌టైమ్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా ప్రస్తుతం కమర్షియల్ సినిమాలు రెండున్నర గంటల లోపే ఉండేలా దర్శకులు ప్లాన్ చేస్తున్న సమయంలో.. 'పెద్ది' మాత్రం దాదాపు 3 గంటల 9 నిమిషాల (189 నిమిషాలు) నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. రంగస్థలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి సుదీర్ఘ నిడివితో వస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. దర్శకుడు బుచ్చిబాబు కథపై పూర్తి నమ్మకంతోనే ఈ భారీ రన్‌టైమ్‌ను ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. సినిమాలోని భావోద్వేగాలు, గ్రామీణ వాతావరణం, యాక్షన్ ఎలిమెంట్స్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రేక్షకులను మొత్తం ప్రయాణంలో కట్టిపడేస్తాయని చిత్ర బృందం విశ్వాసంగా ఉందట. ఎక్కడా కథ నెమ్మదించకుండా స్క్రీన్‌ప్లేను ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రం 1980ల కాలం నాటి గ్రామీణ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కింది. గ్రామీణ జీవన విధానం, క్రీడా సంస్కృతి, పంతాలు, భావోద్వేగాలు, మనుషుల మధ్య బంధాలను కథలో ప్రధానాంశాలుగా తీసుకున్నట్లు సమాచారం. ఈ సినిమాలో రామ్ చరణ్ పూర్తిగా కొత్త



రస్టిక్ లుక్‌లో కనిపించనున్నారు. పాత్ర కోసం ఆయన తన శరీరాకృతిని కూడా ప్రత్యేకంగా మార్చుకున్నట్లు ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ ద్వారా స్పష్టమైంది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇక సెన్సార్ బృందం నుంచి కూడా సినిమాకు మంచి స్పందన వచ్చినట్లు ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా రామ్ చరణ్ నటన, బుచ్చిబాబు మేకింగ్, సినిమాలోని ఎమోషనల్ కంటెంట్ ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయని టాక్ వినిపిస్తోంది. కేవలం మాస్ యాక్షన్ మాత్రమే కాకుండా భావోద్వేగాలు కూడా ప్రేక్షకులను కదిలించే స్థాయిలో ఉంటాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంపై రోజురోజుకీ అంచనాలు మరింత పెరుగుతున్నాయి.

# శ్రీలీల డేటింగ్ రూమర్లపై తల్లి క్లారిటీ..



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల వ్యక్తిగత జీవితం మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్ని రోజులుగా యువ క్రికెటర్ తిలక్ వర్మతో శ్రీలీల డేటింగ్‌లో ఉన్నారంటూ సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ఇద్దరూ కలిసి కనిపించిన కొన్ని సందర్భాలను ఆధారంగా చేసుకుని నెట్టింట అనేక కథనాలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రూమర్లపై తాజాగా శ్రీలీల తల్లి స్వర్ణలత స్పందిస్తూ పూర్తి క్లారిటీ ఇచ్చారు. ప్రచారంలో ఉన్న కథనాలన్నింటినీ పూర్తిగా ఖండించిన స్వర్ణలత.. వాటిలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. "ఇలాంటి వార్తలు ఎలా పుడతాయో కూడా అర్థం కావడం లేదు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో అణువంత కూడా వాస్తవం లేదు. ఎవరో ఒకరు ఏదో రాస్తే దాన్ని నిజమని నమ్మేస్తున్నారు" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం శ్రీలీల పూర్తిగా తన సినీ కెరీర్, చదువులపైనే దృష్టి పెడుతోందని స్వర్ణలత తెలిపారు. వరుస సినిమా షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ సమయం దొరికినప్పుడల్లా తన వైద్య విద్యకు సంబంధించిన చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. ముఖ్యంగా నీట్-పీజీ పరీక్ష కోసం తీవ్రంగా సన్నద్ధమవుతోందని వెల్లడించారు. "ఇప్పుడే వ్యక్తిగత విషయాలు, రిలేషన్‌షిప్‌ల గురించి ఆలోచించే పరిస్థితి లేదు. ఆమె ముందు ఇంకా చాలా పెద్ద కెరీర్ ఉంది. అలాంటి విషయాలకు ఇంకా ఐదు నుంచి ఆరు సంవత్సరాల సమయం ఉంది" అంటూ స్వర్ణలత స్పష్టం చేశారు. ప్రస్తుతం శ్రీలీల లక్ష్యం మంచి నటిగా నిలబడటంతో పాటు వైద్య విద్యను కూడా పూర్తి చేయడమేనని పేర్కొన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయిన కొన్ని సంఘటనలపై కూడా ఆమె వివరణ ఇచ్చారు. 2025 డిసెంబర్‌లో శ్రీలీల, తిలక్ వర్మ కలిసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ దర్శనం చేసుకున్నారని, అలాగే వాంఖడే స్టేడియంలో జరిగిన టీ20 మ్యాచ్ సమయంలో శ్రీలీల కనిపించడాన్ని ఆధారంగా తీసుకుని ఊహాగానాలు సృష్టించారని తెలిపారు. అయితే ఇవన్నీ యాదృచ్ఛిక సంఘటనలేనని, వాటికి అనవసర అర్థాలు వెతకవద్దని సూచించారు. "ఎవరైనా ఒకే చోట కనిపిస్తే వెంటనే రిలేషన్‌లో ఉన్నారంటూ కథనాలు సృష్టించడం ఇప్పుడు సోషల్ మీడియాలో కామన్ అయిపోయింది. కానీ వాస్తవాలు పూర్తిగా వేరేలా ఉంటాయి" అంటూ ఆమె పేర్కొన్నారు. సినీ రంగంలో ఉన్నవారిపై ఇటువంటి రూమర్లు ఎక్కువగా వస్తుంటాయని, కానీ ప్రతి వార్తను నమ్మకూడదని అభిమానులకు సూచించారు. ఇదే తరహాలో గతంలో కూడా శ్రీలీల వ్యక్తిగత జీవితంపై అనేక కథనాలు వచ్చాయని స్వర్ణలత గుర్తుచేశారు. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు కార్తిక్ ఆర్యన్‌తో శ్రీలీల రిలేషన్‌లో ఉన్నారంటూ అప్పట్లో కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందని తెలిపారు. ఆ వార్తలను కూడా తాము అప్పుడే ఖండించామని చెప్పారు. ఆ సందర్భాన్ని వివరిస్తూ.. "కార్తిక్ ఆర్యన్ తల్లి, నేను ఇద్దరం గైనకాలజిస్టులం. వృత్తిపరమైన పరిచయం మాత్రమే ఉంది. కానీ ఆ పరిచయాన్నే తప్పుగా అర్థం చేసుకుని మీడియాలో అనవసర కథనాలు సృష్టించారు" అని వెల్లడించారు. ప్రస్తుతం శ్రీలీల టాలీవుడ్‌లో అత్యంత బిజీ హీరోయిన్‌లలో ఒకరిగా కొనసాగుతున్నారు. వరుస సినిమాలతో ఆమె కెరీర్ దూసుకుపోతోంది. స్టార్ హీరోల సరసన అవకాశాలు దక్కించుకుంటూ తక్కువ సమయంలోనే స్టార్‌డమ్ సంపాదించుకుంది. ఇదే సమయంలో సోషల్ మీడియాలో ఇటీవల సినీ సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై ఆధారాలు లేకుండానే సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపిస్తున్న నేపథ్యంలో.. అభిమానులు కూడా ఇలాంటి వార్తలను నమ్మేముందు నిజానిజాలు తెలుసుకోవాలని అభిప్రాయపడుతున్నారు. సోషల్ మీడియా పోస్టులు, ఫోటోలు, వీడియోలను మాత్రమే ఆధారంగా చేసుకుని సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదని పలువురు పేర్కొంటున్నారు.

# 'డ్రాగన్' గ్లింప్స్‌కు రంగం సిద్ధం..



**వేద న్యూస్ డెస్క్:**

యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా, స్టార్ దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ ఇండియా చిత్రం డ్రాగన్ నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న భారీ అప్‌డేట్ ఎట్టకేలకు వచ్చేసింది. తారక్ పుట్టినరోజు సందర్భంగా మే 20న ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా గ్లింప్స్ ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో వస్తుండగా.. 'డ్రాగన్' గ్లింప్స్ మాత్రం ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల భారీ నిడివితో రానుండటం విశేషంగా మారింది. ఈ స్పెషల్ వీడియోను రేపు రాత్రి 11:52 గంటలకు సోషల్ మీడియా వేదికగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన కొన్ని థియేటర్లలో కూడా ఈ గ్లింప్స్‌ను ప్రదర్శించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ వీడియోకు సెన్సార్ బోర్డు నుంచి క్లియరెన్స్ లభించింది. గ్లింప్స్‌కు ఖ/యూ 16+ సర్టిఫికెట్ జారీ చేసినట్లు తెలుస్తోంది. "విధ్వంసం మరో రేంజ్‌లో ఉంటుంది" అంటూ నిర్మాతలు విడుదల చేసిన క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆర్ఆర్ఆర్, దేవర వంటి భారీ చిత్రాల తర్వాత ఎన్టీఆర్ నటిస్తున్న సినిమా కావడం.. మరోవైపు కేజీఎఫ్, సలార్ చిత్రాలతో ఇండియన్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తుండటంతో 'డ్రాగన్'పై దేశవ్యాప్తంగా అసాధారణమైన అంచనాలు నెలకొన్నాయి. ప్రశాంత్ నీల్ మార్క్ హై-వోల్టేజ్ యాక్షన్ ఎలిమెంట్స్, భారీ ఎలివేషన్స్, మాస్ విజువల్స్ ఈ చిత్రంలో నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుండగా.. ఇప్పుడు గ్లింప్స్ అనౌన్స్‌మెంట్‌తో నందమూరి అభిమానుల్లో మరింత జోష్ నెలకొంది.

# ఫిట్‌నెస్‌పై కీర్తి సురేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు..

**వేద న్యూస్ డెస్క్:**




ఒకప్పుడు బొద్దుగా కనిపిస్తూ సహజ అందంతో అభిమానులను ఆకట్టుకున్న నటి కీర్తి సురేశ్.. ఇప్పుడు ఫిట్‌నెస్ ఐకాన్‌గా మారిపోయింది. ఇటీవల ఆమె లుక్‌లో వచ్చిన భారీ మార్పు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఒక్కసారిగా బరువు తగ్గి స్లిమ్‌గా కనిపించడంతో పలువురు నెటిజన్లు ఆమెపై అనేక రకాల వ్యాఖ్యలు చేశారు. కొందరు ఆపరేషన్లు చేయించుకుందని, మరికొందరు ప్రత్యేక ట్రీట్‌మెంట్లు తీసుకుందని ప్రచారం చేశారు. ఈ విమర్శలపై తాజాగా కీర్తి సురేశ్ స్పందించింది. తన ఫిట్‌నెస్ ప్రయాణం గురించి ఇప్పటివరకు ఎప్పుడూ బహిరంగంగా మాట్లాడలేదని తెలిపిన కీర్తి.. మొదట్లో జిమ్ అంటే అస్సలు ఇష్టం ఉండేదే కాదని చెప్పింది. "జిమ్ అనేది నా కోసం కాదని అనుకునేదాన్ని. వ్యాయామం చేయాల్సిన అవసరం నాకు లేదనే భావనలో ఉండేదాన్ని. కానీ 'మహానటి' సినిమా తర్వాత వచ్చిన విరామం నా గురించి నేను ఆలోచించుకునే అవకాశం ఇచ్చింది" అని తెలిపింది. ఆ సమయంలోనే ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నానని, క్రమంగా వర్కవుట్లు ప్రారంభించానని చెప్పింది. "కేవలం తొమ్మిది నెలల్లోనే దాదాపు పది కిలోలు తగ్గాను. అది ఒక్కసారిగా జరిగిన మార్పు కాదు. క్రమశిక్షణతో చేసిన ప్రయత్నం ఫలితం" అని వెల్లడించింది. తనను లావుగా ఉందంటూ బాడీ షేమింగ్ చేసిన వారికి ఈ మార్పే సమాధానమని కీర్తి పేర్కొంది. "నన్ను చూసి చాలా మంది కామెంట్లు చేశారు. కానీ నేను ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం అనుకోలేదు. నా కష్టమే నా సమాధానం అయింది" అంటూ చెప్పుకొచ్చింది. ఇక ఇప్పుడు జిమ్ తన జీవితంలో భాగమైందని తెలిపిన కీర్తి.. "ఒకప్పుడు జిమ్ అంటే భయం. ఇప్పుడు ఒక రోజు వర్కవుట్ చేయకపోతే ఏదో మిస్సైనట్లు అనిపిస్తుంది. అది మంచి అలవాటుగా మారింది" అని పేర్కొంది. తన స్టైల్‌లో కూడా వచ్చిన మార్పు గురించి మాట్లాడుతూ.. "ఒకప్పుడు నేను చీరల్లోనే బాగుంటానని అనుకునేవారు. ఇప్పుడు మోడ్రన్ డ్రెస్సుల్లోనూ ప్రశంసలు అందుకోవడం సంతోషంగా ఉంది" అని తెలిపింది. ప్రస్తుతం కీర్తి సురేశ్ పలు భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా కొనసాగుతోంది. నటిగా మాత్రమే కాకుండా ఫిట్‌నెస్ విషయంలోనూ యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073